సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం। 7। సెప్టెంబర్। 2023



సోమశిలలో 19.78 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 19.789 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 13980 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,110
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,500
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,665
నవర (8 గ్రాములు)	రూ.45,320

గరిష్టం/కనిష్టం 33.5 /26.6

వాతావరణం

వాతావరణంలో తేమ 62 శాతంగా ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం గురువారం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులును కలెక్టర్ హరి నారాయణన్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బొకేను అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని పాల్గొన్నారు.

వేళాంగణిమాత మహోత్సవాలు ప్రారంభం



తోటపల్లిగూడూరు: కోడూరులోని వేళాంగణి మాత మహోత్సవాలు అట్టహాసంగా బుధవారం ప్రారంభమయ్యాయి. వేళాంగణి మాత జన్మదినాన్ని సెప్టెంబర్ 8న పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ లూకాస్ రాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను జరిపారు. మరియమాత – విశ్వజనని అనే అంశంపై పలువురు దైవ సేవకులు సందేశాన్ని అందించారు. మరియమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమం ముత్యాలతోపు మీదుగా మహాలక్ష్మీపురం వరకు సాగింది. కోడూరు తీరంలో సముద్ర స్నానాలను భక్తులు ఆచరించారు.

ఉత్సవాల్లో నేడు

వేళాంగణి మాత ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.30కు జపమాల – నవదిన ప్రార్థనలు, 9.30 నుంచి సాయంత్రం నాలుగు వరకు ఆరాధన – స్వస్థత ప్రార్థనలను నిర్వహించనున్నారు. గురువు కనిగిరి డీనర్ ఆధ్వర్యంలో వేళాంగణిమాతకు జపమాల, దివ్య బలి పూజలను సాయంత్రం ఆరు గంటలకు జరపనున్నారు. చర్చి నుంచి కొత్త కోడూరు వరకు వేళాంగణిమాత విగ్రహ తేరుప్రదక్షిణను రాత్రి 8.30కు నిర్వహించనున్నారు.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరులోని శివాజీకాలనీలో నివాసం ఉంటున్న పెయింటర్ కృష్ణకు భార్య, సాయికిరణ్ (29), విష్ణువర్ధన్ సంతానం. సాయికిరణ్ ఇంటర్ వరకు చదువుకొని ఉద్యోగ యత్నాలు చేశారు. అయితే ఉద్యోగం రాకపోవడంతో ప్రస్తుతం పెయింట్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆయనకు షుగర్ వ్యాధి సోకింది. ఉద్యోగం రాకపోవడం.. అనారోగ్యం.. వయస్సు పైబడుతున్న వివాహం కాలేదని సాయికిరణ్ బాధపడేవారు. తనకు పని ఉందని.. హైవేలో వదలాలని సోదరుడ్ని మంగళవారం కోరారు. దీంతో బైక్‌పై హైవేపై వదిలిపెట్టొచ్చారు. సాయికిరణ్ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతని కోసం చుట్టుపక్కల గాలించారు. బుజబుజనెల్లూరులోని లింగాలయ్య చెరువు సమీపంలో గల ఖాళీ ప్లాట్‌లో సాయికిరణ్ మృతి చెంది ఉన్నారని,, పక్కనే పురుగు మందు ఖాళీ డబ్బా పడి ఉందని తెలిసిన వారు కృష్ణకు బుధవారం చెప్పారు. దీంతో ఆయన కుటుంబసభ్యులతో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. విగతజీవిగా పడి ఉన్న సాయికిరణ్‌ను చూసి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని వేదాయపాళెం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎస్సై అంకమ్మ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్కచెల్లెమ్మలకు అభయహస్తం



స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వీరికి వందల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేసి తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25,542 ఎస్‌హెచ్‌జీలకు రూ.1009.53 కోట్ల రుణాలను మంజూరు చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

- ఎస్‌హెచ్‌జీలకు విరివిగా రుణాలు
- రూ.రెండు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు
- కుటీర పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(పొగతోట): అక్కచెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ)లకు బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేసి తద్వారా వారి అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1009.53 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9579 గ్రూపులకు రూ 393.72 కోట్ల మేర మంజూరు చేశారు.



స్వయం సహాయక గ్రూపు సభ్యుల సమావేశం (ఫైల్)

నూతన విధానానికి శ్రీకారం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో నూతన విధానాన్ని ప్రారంభించారు. గ్రూపు రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలనూ మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. ఇలా రూ.రెండు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తున్నారు. మండలాల వారీగా అర్హులను ఎంపిక చేసి వారికి మంజూరు చేసేలా డీఆర్డీఏ, బ్యాంక్ అధికారులు చర్యలు చేపట్టారు. డెయిరీలు, ఫ్లోర్ మిల్లులు, పచ్చళ్ల తయారీ, పిండి మిల్లులు, బ్యూటీషియన్, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మహిళలకు రుణాలు మంజూరు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తూ వారితో మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేయిస్తూ వారు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టారు.

ఆర్భాటానికే గత ప్రభుత్వం పరిమితం

గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్‌హెచ్‌జీలకు తక్కువ మొత్తంలో రుణాలిచ్చారు. ఆ సమయంలో ఏడాదిలో వెయ్యి కోట్ల రుణాలనూ మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఏటా అధికంగా రుణాలను మంజూరు చేస్తున్నారు. రుణాలు పొంది సక్రమంగా చెల్లించిన గ్రూపులకు వడ్డీని వారి బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం జమచేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసేలా డీఆర్డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. గత రెండేళ్లలో వంద శాతానికిపైగా రుణాలను మంజూరు చేశారు.

రుణాల మంజూరు ఇలా..

ఏడాది	మొత్తం ఎస్‌హెచ్‌జీలు	లక్ష్యం (రూ.కోట్లలో)	ఎస్‌హెచ్‌జీలు	మంజూరు (రూ.కోట్లలో)
2015 - 16	24,808	544.56	19,914	543.95
2016 - 17	29,026	620.46	22,509	732.63
2017 - 18	24,314	553.11	25,189	684.38
2018 - 19	19,618	553.31	25,047	814.55
2019 - 20	35,318	819.75	33,408	1087.60
2021 - 22	23,449	883.41	24,552	1192.43
2022 - 23	25,731	1031.31	27,941	1273.59
2023 - 24	39,289	1009.53	9,579	393.72

భరోసా కల్పిస్తూ..

బ్యాంక్ లింకేజీ రుణాలు గ్రామీణ ప్రాంతాల మహిళలను ఆదుకుంటున్నాయి. కొంత మొత్తాన్ని అవసరాలకు వినియోగించుకొని మిగిలిన నగదుతో చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పేద మహిళలు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండటంతో ఎలాంటి ష్యూరిటీ లేకుండా రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి.

మొత్తం ఎస్‌హెచ్‌జీలు: 39,289	సభ్యులు: 4,09,523 మంది
రుణ మంజూరు లక్ష్యం: రూ.1,009 కోట్లు	ఇప్పటి వరకు అందజేసింది: రూ.393.72 కోట్లు

లబ్ధి పొందనున్న గ్రూపులు: 25,542

ఆర్థిక ప్రగతి సాధిస్తున్నా



17 ఏళ్లగా గ్రూపులో సభ్యురాలిగా ఉన్నా. బ్యాంక్ ద్వారా రూ 1.5 లక్షల రుణాన్ని పొంది.. కూల్‌డ్రింక్స్ షాపును ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా. కరోనా అనంతరం వ్యాపారం బాగా జరుగుతోంది. ఆదాయంతో షాపును మరింత అభివృద్ధి చేస్తున్నా.

– శారద, చేజర్ల

ఫ్యాన్సీ, బుక్స్ షాపును ఏర్పాటు చేశా



బ్యాంక్ ద్వారా రూ 2.7 లక్షల రుణాన్ని పొంది ఫ్యాన్సీ, బుక్స్ షాపును ఏర్పాటు చేశా. డీఆర్డీఏ అధికారుల సూచనలు పాటిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నా. రుణాన్ని బ్యాంకులకు సకాలంలో చెల్లిస్తున్నాం.

– సుష్మా, చేజర్ల

లక్ష్యానికి మించి మంజూరు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌హెచ్‌జీలకు రూ.1009.53 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా, రూ 393.72 కోట్లను మంజూరు చేశాం. లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపడుతున్నాం. రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా చూస్తున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్డీఏ పీడీ

కంప్యూటర్ సైన్స్‌కే జై



- ముగిసిన ఏపీఈఏపీ తొలి విడత కౌన్సెలింగ్
- ఈ ఏడాది 67.62 శాతం సీట్ల భర్తీ
- త్వరలో రెండో విడత కౌన్సెలింగ్

మొత్తం ఇంజినీరింగ్ కళాశాలలు (ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో): 17	
అన్ని బ్రాంచీల్లో సీట్లు: 7,899	భర్తీ అయినవి: 5,342
కంప్యూటర్ సైన్స్ సీట్లు: 1,907	

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల ఆశలు చిగురించాయి. జిల్లాలోని కళాశాలల్లో చేరేందుకు ఈ ఏడాది విద్యార్థులు మొగ్గు చూపారు. కరోనా, ఇతర కారణాలతో జిల్లాలోని కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు గతంలో వెనుకంజ వేయడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు డీలా పడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో పూర్తి స్థాయిలో రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో జిల్లాలోని విద్యార్థులు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాల్లోని కళాశాలల్లో చేరారు.

ప్రభుత్వ చొరవ

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కళాశాల ఫీజు ఎంత ఉంటే అంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు చేపట్టారు. ఒక్కో కళాశాలకు ఒక్కో రకమైన ఫీజును నిర్ణయించారు. దీంతో పాటు వసతిదీవెన పేరిట ఏటా రూ.20 వేలు చెల్లిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా చర్యలు చేపట్టడంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 67.62 సీట్లు భర్తీ అయ్యాయి.

సీట్ల భర్తీ ఇలా..

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 17 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో అన్ని బ్రాంచీలకు కలిపి 7,899 సీట్లు ఉన్నాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో 5,342 సీట్లు భర్తీ అయ్యాయి. నెల్లూరులోని నారాయణలో 93.1, గీతాంజలిలో 92.71, వెంకటేశ్వరలో 92.7, గూడూరులోని నారాయణలో 82.95, కావలిలోని విశ్వోదయలో 79.27, కోటలోని ఎన్బీకేఆర్‌లో 78.47, గూడూరులోని ఆదిశంకరలో 76.23, కావలి సమీపంలోని ఆరెస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో 68.15 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 50 శాతంలోపు ఐదు, 20 శాతం లోపు సీట్లు భర్తీ అయిన ఇంజినీరింగ్ కళాశాలలు మూడు ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్‌కే డిమాండ్

ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, సివిల్, సీఎస్ఎం, సీఎస్డీ / ఏఐఎం / ఏఐఎమ్మెల్, సీఎస్సీ, సీసీ / ఏఐడీ, ఈసీఈ, ఈసీఏ, ఈఈఈ, ఈవీటీ, మెకానికల్, ఏఐ / సీఏఐ, ఐఎన్ఎఫ్ / డీఎస్ / సీఏస్ట్, తదితర కోర్సులు ఉన్నాయి. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో కంప్యూటర్ సైన్స్ కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపారు. ఆ తర్వాత ఈసీఈ, ఏఐ / డీఎస్, సీఎస్డీ, తదితర కోర్సులకు డిమాండ్ ఉంది. జిల్లాలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి 2,196 సీట్లు ఉండగా, 1,907 భర్తీ అయ్యాయి. ఈసీఈలో 2,055కు గానూ 1,321, సీఎస్ఎంలో 336కు గానూ 336, సీఎస్డీ / ఏఐఎం / ఏఐఎమ్మెల్ కోర్సుల్లో 498కు గానూ 497 సీట్లు భర్తీ అయ్యాయి. జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు మిగిలిన కోర్సుల సీట్లు తగ్గించుకొని కంప్యూటర్ సైన్స్‌కు సీట్లు పెంచుకుంటున్నాయి.

కళాశాల బట్టి ఫీజు

ఇంజినీరింగ్‌లో నాణ్యమైన విద్యనందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాదిలో కళాశాలను బట్టి రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజుగా నిర్ణయించారు. ఈ ఏడాది దీన్ని రూ.42 వేల నుంచి రూ.77 వేలుగా ఖరారు చేశారు. కళాశాలలో ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, తదితరాలను పరిగణనలోకి తీసుకొని ఫీజును నిర్ణయిస్తారు.

రీయింబర్స్‌మెంట్ ద్వారా మొత్తం చెల్లింపు

ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులకు సదరు కళాశాలలో ఫీజు ఎంత ఉంటే అంతే మొత్తాన్ని ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. విద్యార్థులు ఒక్క పైసా అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉండదు. వసతి దీవెన పేరుతో రూ.20 వేలను విద్యార్థి తల్లి ఖాతాలో ప్రభుత్వం జమచేస్తోంది. దీంతో జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఏపీఈఏపీ సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌ను త్వరలో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

బ్రాంచ్ ఎంపికలో జాగ్రత్త అవసరం



ఇంజినీరింగ్‌ను ఎందుకు చదవాలనే అంశంపై విద్యార్థులు మొదట అధ్యయనం చేయాలి. తదుపరి బ్రాంచ్ ఎంపికలో తగు జాగ్రత్తలు పాటించాలి. అందరూ కంప్యూటర్ ఇంజినీరింగ్‌లోనే చేరుతున్నారు. తామూ అక్కడే చేరాలనే భావనను పక్కనబెట్టాలి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ బ్రాంచీలకు అత్యున్నతమైన ఉపాధి అవకాశాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయి. కోర్ ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకు అపారమైన డిమాండ్ ఉంది.

– యర్రగుంట్ల దినకర్, డైరెక్టర్, కెరీర్ గైడెన్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్

పేదలందరికీ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం



ఇళ్ల పట్టాను అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: పేదలందరికీ ఇళ్లు నిర్మించివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బద్దెవోలులో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లో ఇళ్ల స్థలాల పట్టాలను లబ్ధిదారులకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన చెన్నకేశవాలయంలో నిర్వహించిన కుంభాబిషేక మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం పిడూరుపాళెంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. బద్దెవోలు ఎస్సీల ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించడం సంతోషకరమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు పలుమార్లు పట్టాలిచ్చి స్థలాలు చూపకుండా ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం హద్దు రాళ్లు వేసి స్థలాలను కేటాయించడమే కాకుండా ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటునందిస్తామని తెలిపారు. బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. 147 మందికి ఇంటి స్థలాలను మంజూరు చేశామని, ఇలాంటి సమస్య పరిష్కారమైనప్పుడు మనస్సుకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. ఇంటి నిర్మాణాలను ప్రారంభించిన వెంటనే విద్యుత్, తాగునీరు, సైడ్ డ్రెయిన్లు తదితర మౌలిక వసతులను లేఅవుట్లో ఏర్పాటు చేయిస్తామని ప్రకటించారు. ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని దళితులు కోరారని, దీనికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలను మంజూరు చేయిస్తామని తెలిపారు. ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ యూఎస్కే రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏదెం మల్లికార్జునరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, శానంపూడి సురేందర్‌రెడ్డి,, గుండాల ఆదినారాయణ, నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష గడపల విజయోత్సవ సభ నేడు

కోవూరు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లక్ష గడపలను పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందుకూరుపేట మండలం మైపాడు తీరంలో లక్ష గడపల విజయోత్సవ సభను గురువారం సాయంత్రం నిర్వహించనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఏడాది క్రితం ప్రారంభించిన కార్యక్రమం నేటితో లక్ష గడపలను పూర్తి చేసుకోనుంది. నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికెళ్లినా ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలతో ఆయన మమేకమై వారి కష్టాలను తెలుసుకొని సమస్యలను పరిష్కరించారు. అనాథలు, అభాగ్యులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేయూతనిచ్చారు. లక్ష గడపల విజయోత్సవ సభకు భారీగా తరలిరావాలని కోరుతున్నారు.

ఆనం.. ఏమిటీ ఆగం..?

- వలంటీర్ల సమావేశం వద్దకెళ్లి నానా యాగీ
- ఓటర్లను తొలగిస్తున్నారంటూ ఆరోపణలు

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సంగంలో బుధవారం చీప్ పాలిటిక్స్ చేసి నవ్వుల పాలయ్యారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంగంలో స్థానిక వలంటీర్లతో సమావేశాన్ని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు ఏర్పాటు చేశారు. సచివాలయాల పరిధిలో సమస్యల గుర్తింపు, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, తదితర అంశాలపై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇలా రెండు రోజులుగా సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంగంలోని సొసైటీ కార్యాలయంలో వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక మండలాధ్యక్షులతో పాటు ఎమ్మెల్యే ప్రతినిధులు హాజరయ్యారు. అయితే వలంటీర్లతో సొసైటీ కార్యాలయంలో సమావేశాన్ని పెట్టడమే తప్పనే రీతిలో అక్కడికి వెళ్లిన ఆనం రామనారాయణరెడ్డి నానా హంగామా చేశారు. ఓట్ల తొలగింపు ప్రక్రియ చేస్తున్నారంటూ ఆరోపణలకు దిగారు. వాస్తవానికి కలెక్టర్ హరినారాయణన్ సంగం మండలంలో ఇటీవల పర్యటించి ఓట్ల తొలగింపు, చేర్పుల విషయాన్ని పరిశీలించారు. ఎక్కడా అవకతవకలు జరగలేదని ఆయన ప్రకటించిన విషయం విదితమే. అయితే ఇవేవీ తెలుసుకోకుండా ఆనం రామనారాయణరెడ్డి హడావుడి చేయడంపై పలువురు మండిపడుతున్నారు.



అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

ఎంసీఏకు యమ క్రేజ్

- గతేడాది 2,790 సీట్లకే అనుమతి
- 2023 – 24 విద్యా సంవత్సరానికి 5,640 సీట్ల భర్తీకి పచ్చజెండా

అనంతపురం: జేఎన్టీయూ అనంతపురం పరిధిలోని రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని 68 కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల నిర్వహణకు ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి గానూ 43 ఇంజినీరింగ్, రెండు ఇంటిగ్రేటెడ్, 23 స్టాండలోన్ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎంబీఏలో 9,912 సీట్లు, ఎంసీఏలో 5,640 సీట్లు భర్తీ చేసుకునేందుకు అనుమతి లభించింది. గతేడాది ఎంసీఏ సీట్లను 2,790 మాత్రమే కేటాయించగా, తాజాగా 5,640 సీట్లు కావాలని కోరారు. ఈ మేరకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకోగా, దీనికి జేఎన్టీయూ అనంతపురం ఆమోదం తెలిపింది. ఎంబీఏలో గతేడాది 8,757 సీట్లు ఉండగా, తాజాగా 9,192కు పెంచారు. ఎంబీఏ నామమాత్రంగా పెరగ్గా, ఎంసీఏ కోర్సులో సీట్లు భారీగా పెరగడం విశేషం. ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఎంసీఏ కోర్సుకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఐసెట్ కౌన్సెలింగ్ షురూ..


ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ అనంతరం అత్యంత ప్రాధాన్యమైన ఐసెట్ – 2023 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఏపీ ఐసెట్‌ను కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను విడుదల చేసింది. కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేయనున్నారు. వెబ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 8 నుంచి 14 వరకు ఉంటుంది. తొమ్మిది నుంచి 16 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 12న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 22న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశాన్ని కల్పించారు.

కృష్ణా.. ముకుందా.. మురారీ

కృష్ణాష్టమి పండగను బుధవారం జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. కృష్ణా.. ముకుందా.. మురారీ అంటూ భక్తులు స్వామికి ప్రణమిల్లారు. నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో ఉట్టి మహోత్సవాలు సందడి సందడిగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చూసుకుని మురిసిపోయారు.

– సాక్షి నెట్‌వర్క్


కృష్ణుడి సేవలో..


ఇస్కాన్ మందిరంలో


ఆత్మకూరులో ఉట్టి కొడుతూ..


కన్నయ్యకు ప్రణమిల్లి..


కావలిలోని ఓ పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

క్లుప్తంగా

వింజేటమ్మ ఆలయాభివృద్ధికి ప్రణాళికలు

- రూ.2.35 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు


మొక్క నాటుతున్న డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు సమీపంలో ఉన్న వింజేటమ్మ కొండపై వెలసిన అమ్మవారి దేవాలయ ప్రాంతాన్ని టెంపుల్ ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు రూ.2.35 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వింజమూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద ఎకరాల అటవీ ప్రాంతాన్ని సుందరీకరించడంతోపాటు టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో చిల్డ్రన్ పార్కు, యోగా సెంటర్, టూరిజం బంగ్లా నిర్మాణం తదితర వసతులు కల్పిస్తామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న జింకలు, నెమళ్లతోపాటు వివిధ రకాల వన్యప్రాణుల సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వింజేటమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న వివిధ రకాల కట్టడాలను ఆధునికీకరించడం కూడా చేస్తామని చెప్పారు. వంటశాల, భోజనశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వింజమూరు నుంచి అమ్మవారి దేవాలయం వరకు అటవీ ప్రాంతంలో వెళ్లే రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి ఆర్థికంగా సహాయం చేసేందుకు సుముఖత తెలపడంతో గురువారం రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. తొలుత ఆలయ సమీపంలో అధికారులు, నాయకులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమాశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు


- మానవత్వం చాటుకున్న సీఐ


108 అంబులెన్స్ వద్ద సీఐ

సంగం: రోడ్డు ప్రమాదానికి గురై ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. సంగం సీఐ రవినాయక్ వెంటనే స్పందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన ఘటన బుధవారం సంగం నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పొదలకూరు మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి (65) పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఆత్మకూరుకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో సంగం కొండ మలుపు వద్ద పాతరోడ్డు వైపు వెళ్లేందుకు తిరుగుతుండగా సంగం నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో నారాయణరెడ్డి కాలికి తీవ్రగాయమైంది. అటుగా వెళ్తున్న సీఐ రవినాయక్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి పిలిపించి క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించి కాపాడారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10



కనులపండువగా అంకమ్మతల్లి ఉత్సవాలు


అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట


ధాన్యాధివాసం చేస్తున్న భక్తులు

- యాగశాలలో చండీహోమం
- ఉత్సవాలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టలో భాగంగా ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం అమ్మవారికి క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం వంటి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం యాగశాలలో వేదమంత్రోచ్చారణల మధ్య చండీ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

అంకమ్మతల్లి నూతన ఆలయం ప్రారంభోత్సవంతోపాటు, అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం గురువారం ఉదయం 10.47 నుంచి 1.30 గంటల మధ్య జరుగుతుంది. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతోపాటు, జిల్లాలోని ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను ఆహ్వానించారు. పలువురు వీఐపీలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. అలాగే ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా హాజరవుతారని, వారికి అమ్మవారి ప్రసాదం కింద అన్నదానం ఉంటుందని ఇప్పటికే కమిటీ సభ్యులు ప్రకటించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆలయంతో పాటు, ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీప కాంతులతో అత్యద్భుతంగా అలంకరించారు.

తరలిరావాలని పిలుపు

అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ప్రతిఒక్కరూ తరలిరావాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కోరారు. దేవాలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలతోపాటు, ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలో చేరేందుకు చాలామంది సిద్ధం

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. 51వ డివిజన్ కపాడిపాళెనికి చెందిన ఎస్.సందీప్, వారి మిత్రబృందం సుమారు 150 మంది నగరంలోని రాజన్నభవన్‌లో బుధవారం అనిల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అన్ని విధాలుగా అండగా ఉన్న సీఎం జగనన్నను ప్రజలు దీవిస్తున్నారన్నారు. మంత్రి నారాయణ నాలుగున్నర సంవత్సరాలు ప్రజలకు కనిపించలేదన్నారు. కనీసం వారి కార్యకర్తల బాగోగులు కూడా పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో తిరగడం హాస్యాస్పదంగా ఉందని, ప్రజలందరూ ఆయన ఎలాంటి వ్యక్తో అర్థం చేసుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఏవీ సునీల్, ఎ.రవి, ఎ.సుధీర్, ఎ.సుమన్, ఎ.హేమంత్ పి.వాణి, ఎ.జ్యోతి తదితరులున్నారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ ఇన్‌చార్జి కాయల సురేష్ బాబు, నాయకులు బాలా ప్రసాద్, అరవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ వారంతా ఇప్పుడే గుర్తొచ్చారా?

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'రైతులు, మహిళలు, యువత ఇప్పుడే గుర్తొచ్చారా చంద్రబాబూ.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వారిని మోసం చేసిన విషయం మర్చిపోయావా?' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని దామేగుంటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గం సభలో రైతులు, మహిళలు యువతపై బాబు ప్రేమ ఒలకపోయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని అధికారంలోకి వచ్చి దాని గురించి పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. రైతు, పొదుపు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశాడన్నారు. 2014 ఎన్నికల సమయంలో వందల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చని చరిత్ర బాబుది అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ, 22 ఎంపీ స్థానాలను ప్రజలు ఇచ్చారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచారని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కొడుకు, వారి చుట్టూ ఉన్న కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులే బాగుపడ్డారు తప్ప పేదల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. నాలుగున్నరేళ్లపాటు ఎక్కడున్నారో కూడా తెలియని బాబు, పవన్ కళ్యాణ్‌లు ఆరునెలల్లో ఎన్నికలొస్తుండడంతో వచ్చి ప్రజలపై ప్రేమ ఒలకపోస్తున్నారని దుయ్యబట్టారు. నాకు రాజకీయాలే అవసరం లేదని రాయదుర్గం సభలో చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాంటి వ్యక్తికి మామపై చెప్పులు వేయించి కుర్చీ లాక్కోవాల్సిన అవసరం ఏం వచ్చిందో చెప్పాలన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ గాలి జ్యోతి, జెడ్పీటీసీ పసుపులేటి సరోజనమ్మ, సర్పంచ్ చిమటా హరిత, నాయకులు చిమటా శేషగిరి, కొట్టే మల్లికార్జున, ఆర్.వెంకటేశ్వర్లునాయుడు, ఎ.వెంకటరత్నం పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. పోలీసులు బుధవారం వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన అరుణ రెండునెలల క్రితం బాలాజీనగర్ శ్రీనగరికాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుంది.. దామరమడుగుకు చెందిన నాగేంద్ర అనే యువకుడిని అసిస్టెంట్‌గా పెట్టుకుంది. వారు రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను తీసుకొచ్చి వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు బాలాజీ నగర్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకురాలు, ఆమె అసిస్టెంట్, సెక్స్‌వర్కర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిర్వాహకురాలు, అసిస్టెంట్‌పై కేసు నమోదు చేశారు. సెక్స్‌వర్కర్‌ను హోంకు తరలించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 153
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 260
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 290
లేయర్ చికెన్	: 178

అనారోగ్య సమస్యతో ఆత్మహత్య

కోవూరు: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కోవూరు మండలం చెర్లోపాళెం వలంటీర్‌గా కరుణాకర్ (34) పనిచేస్తున్నాడు. అతను అల్లూరు మండలం రాయపేటకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యా పిల్లలతో రాయపేటకి వెళ్లిన కరుణాకర్ మంగళవారం సాయంత్రం ఒక్కడే చెర్లోపాళెం వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు రాత్రి గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈలోపు వారు కరుణాకర్‌ను తీసుకుని ఆస్పత్రికి బయలుదేరారు. ఇనమడుగు సెంటర్‌కు రాగానే 108 వాహనం ఎదురుపడింది. అందులోని సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా కరుణాకర్ నిత్యం మద్యం తాగేవాడు. కామెర్లతో ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్య సమస్యతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు, స్థానికులు వెల్లడించారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.